బహుమతి పొందిన చిట్టికథ



# అసలైన పండుగ

— సి.వి. వసుంధరాదేవి

"మమ్మీ రేపు నా బర్త్‌డే కదూ?"

"అవును మధూ! ఈరోజు సాయంత్రం వెళ్ళి నీ డ్రస్ తెచ్చుకొందువుగాని రెడీగావుండు. ఇద్దరం వెళదాం" రాజ్యలక్ష్మి చీర కుచ్చెళ్ళు సవరించుకొంటూ అంది.

"నువ్వు వద్దులే మమ్మీ! నేను, మనోరమ వెళ్ళి తెచ్చుకొంటాంలే. అన్నట్లు రేపు మనూ పుట్టినరోజు కూడా మమ్మీ. అందుకే ఇద్దరం కలిసి పుట్టినరోజు పార్టీ యివ్వాలని అనుకొంటున్నాం. అందుకే నాకు మనీ యిచ్చెయ్."మధుర చెయ్యి చాచింది డబ్బు కోసం.

"ఓహో, అదన్నమాట మీ ప్లాను. మరి పార్టీ ఎక్కడ అరేంజ్ చెయ్యమంటావు? టౌన్‌హాల్ వాళ్ళకు ఫోన్ చెయ్యనా? ఖాళీ వుందో, లేదో" రాజ్యలక్ష్మి హడావిడిగా ఫోన్ దగ్గరికి పోబోయింది.

"వద్దు మమ్మీ. ఈసారి అన్ని విషయాలు నా బర్త్‌డేకి నేను, మనూ కలిసి ఏర్పాట్లు చేసుకొంటాం. నీకు రేపు సాయంత్రం సరిగ్గా ఆరు గంటలకు కారు పంపుతాను. నువ్వు, డాడీ వెంటనే ఆ కారులో నా బర్త్‌డే జరిగే స్థలానికి రావాలి. సరేనా?" అంది మధుర.

"ఇదేవిటే! నా ఫ్రెండ్స్‌కు, మీ డాడీ ఫ్రెండ్స్‌కు మేము ఇన్విటేషన్స్ పంపుకోవద్దూ? ఎక్కడో తెలియకపోతే పిలిచేదెలా!" రాజ్యలక్ష్మి ఆశ్చర్యపోతూనే మూడువేల రూపాయలు కూతురి చేతిలో పెట్టింది.

"ఆ విషయాలన్నీ నా కొదిలెయ్యి మమ్మీ. నువ్వు నిశ్చింతగా వుండు. టా.టా"చెయ్యివూపి అక్కడి నుంచి తుర్రుమంది మధుర.

"రాముూ! ఏమిటిది. కారు యిక్కడ ఆపావేం?" రాజ్యలక్ష్మి ప్రశ్నించింది విసుగ్గా.

"ఇదేనండి. అమ్మాయిగారు పార్టీ యిచ్చేస్థలం" డోరుతీసి పట్టుకుని వినయంగా జవాబు చెప్పాడు డ్రైవరు.

రాజ్యలక్ష్మి రఘునాధరావులు వొకరి మొహాలొకరు చూచుకొంటూ కారు దిగారు. "హాయ్ డాడీ, మమ్మీ. వెల్‌కమ్" వాళ్ళకొరకే ఎదురుచూస్తున్న మధుర, మనోరమ ఇద్దరూ కారు దగ్గరకు పరుగెత్తారు.

"ఏమిటే నువ్వు చేసిన పని! ఇది మన హోదాకు తగ్గ పనేనా?" రాజ్యలక్ష్మి కూతురిమీద విరుచుకు పడింది.

"మమ్మీ మొన్న స్వాతంత్ర్యదినం రోజు నువ్వు మహిళా మండలి సభ్యులు యిక్కడికి వచ్చినపుడు నేను కూడా వచ్చాను గుర్తుందా? అప్పుడు ఈ పావలనందరినీ "నా పుట్టిన రోజు పండుగకు మా ఇంటికి వస్తారా?" అని అడిగితే వాళ్ళేమన్నారో తెలుసా మమ్మీ "అక్కా... పుట్టినరోజు పండగంటే ఎలా జరుపుకొంటారు? ఏం చేస్తారు?" అన్నారు ఏక కంఠంతో. వాళ్ళు ఎప్పుడు పుట్టారో వాళ్ళకే తెలియని నిర్భాగ్యులు; పుట్టిన రోజు ఎందుకు, ఎలా జరుపుకొంటారో ఎరగని వాళ్లు ఈ పసిపావలు మమ్మీ. అందుకే వాళ్ళకు అందులో వున్న ఆనందం అందియ్యాలని, వాళ్ళ ఆనందంలో నేనూ పాలుపంచుకోవాలని ఇక్కడ, ఈ ఏర్పాటు చేసాను. నాకు తోడుగా మనూ కూడా తన పుట్టినరోజు యిక్కడే జరుపుకోవడానికి నిశ్చయించుకొని తనవాటా డబ్బు తెచ్చింది. ఇది తప్పుకాదు కదూ మమ్మీ... పోనీ నువ్వన్నా చెప్పు డాడీ?" మధుర తండ్రి భుజాలపై చేతులేసి తండ్రి కళ్లల్లోకి చూచింది ఆర్తిగా.

"నమస్కారం అంకుల్, నమస్కారం ఆంటీ!" అంటూ రాజ్యలక్ష్మి, రఘునాధరావుల చుట్టూచేరారు—క్రొత్త బట్టలతో, ఎదలపై ఎర్రగులాబీ పువ్వులతో కాంతికి ప్రతిరూపాలుగా వున్న చిన్న పెద్ద పిల్లలు యాభైమంది వరకు.

కూతురి తలపై ఆ దంపతులిద్దరూ ఒకేసారి చేతులు వేసారు—'తమకంటే తమ కూతురు ఎంత ఎత్తుకు ఎదిగిందా' అన్న ఆలోచనతో ఉక్కిరిబిక్కిరవుతూ.

"లోపలికి రండి అంకుల్! రండి ఆంటీ!" అంటూ మనోరమ దారిచూపగా వాళ్ళు లోపలికి అడుగు పెట్టారు ఆ అనాథ శరణాలయంలోకి... కాదు కాదు ఆ దేవాలయంలోకి! □

Edited & Published by B. Viswanatha Reddi for DOLTON PUBLICATIONS, MADRAS-600 026
& Printed by B. V. REDDI at Prasad Process Private Ltd., Madras-600 026